

బెల్ట్ నివాసులకు పట్టాలు

● మంత్రివర్గ భేటీలో నిర్ణయం ● 86వేల మందికి ప్రయోజనం

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై చుట్టుపక్కల బెల్ట్ ఏరియాగా పిలువబడే చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లో 32 కి.మీల పరిధిలో పోరంబోకు భూముల్లో నివసిస్తున్నవారికి పట్టాలివ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సచివాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ప్రారంభమైన మంత్రివర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, తంగం తెనర్సను, పీకే శేఖర్‌బాబు, గీతా జీవన్, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, సెందిల్‌బాలాజీ, అనితా రాధాకృష్ణన్, కొవి చెళియన్, అన్బిల్ మహేష్‌పొయ్యామొళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రెవెన్యూ విభాగం ప్రధాన కార్యదర్శి అముద తదితరులు పాల్గొన్నారు. సుమారు గంటకుపైగా జరిగిన ఈ సమావేశం అనంతరం సచివాలయం వెలుపల మీడియా సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి కేకేఎస్ఆర్ రామచంద్రన్ వివరాలు వెల్లడించారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి స్టాలిన్ ఓ విప్లవాత్మక చర్యలు చేపట్టారని, ఆ మేరకు చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో ఆక్షేపణ లేని పోరంబోకు భూముల్లో ఎన్నో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్నవారికి పట్టాలను మంజూరు చేయాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. చెన్నైలోనే 29,187 మంది పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్నారని, వీరందరికి ఆరునెలల్లోగా పట్టాలివ్వాలని స్టాలిన్ ఆదేశించారని తెలిపారు. ఈ బెల్ట్ ఏరియా చట్టం 1962లో అమలులోకి వచ్చినా, 2025 వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ పరిస్థితుల్లోనే ఆ చట్టం ప్రకారమే ఆక్షేపణ రహిత పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు మంజూరు చేయాలంటూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని మంత్రి రామచంద్రన్ చెప్పారు. ఈ పట్టాల మంజూరు గురించి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకునేందుకు జిల్లా స్థాయిలో ఓ కమిటీ, రాష్ట్ర స్థాయిలో మరో కమిటీ ఏర్పాటు చేసి ఆరునెలల్లో బెల్ట్ ఏరియా చట్టం ప్రకారం పట్టాలు మంజూరు చేయబోతున్నామని, ఆ పనులను తమ శాఖ చేపడుతుందన్నారు. ఇదే విధంగా మదురై, తిరునల్వేలి వంటి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయితీల్లో ఉన్న బెల్ట్‌ఏరియాలో ఆక్షేపణ రహిత పోరంబోకు భూములలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న సుమారు 57వేలమందికిపైగా ఉన్నారని, వారికి కూడా పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 86 వేల మంది ఈ నిర్ణయం ప్రకారం లబ్ధి పొందనున్నారని తెలిపారు. మొత్తానికి 1962 నుండి 2025 దాకా ఎడతెగని ఈ సమస్యకు ఎట్టకేలకు సీఎం స్టాలిన్ పరిష్కారమార్గాన్ని ఎంచుకుని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో వార్షిక బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలు, కొత్తగా ప్రకటించాల్సిన పథకాలు గురించి కూడా సమగ్రంగా చర్చలు జరిగాయని ఆయన వివరించారు.

63 యేళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

● ఎక్స్‌పేజీలో సీఎం స్టాలిన్

బెల్ట్ ఏరియాలో ఆక్షేపణ రహిత పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని 63 యేళ్లుగా పట్టాలు పొందలేనివారికి శాశ్వత పరిష్కారం కలిగించేలా మంత్రివర్గం సమావేశంలో కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ పేజీలో ఓ సందేశం పోస్టు చేశారు. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లోని బెల్ట్ ఏరియాలో నివసిస్తున్న 29,187 మంది లబ్ధి పొందనున్నారని, అదే విధంగా మదురై, తిరునల్వేలి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, జిల్లాకేంద్రాలు తదితర ప్రాంతాల్లో 57084 మందికి ఆరుమాసాల్లోగా ఇళ్లకు పట్టాలు అందుకోనున్నారని, ఆ దిశగా తాను ఉత్తర్వులిచ్చానని స్టాలిన్ పేర్కొన్నారు.





మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్



ఎమ్మెల్యే చంద్రకుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న స్పీకర్ అప్పావు

ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేసి గెలుపొందిన వీసీ చంద్రకుమార్ సోమవారం ఉదయం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. స్పీకర్ అప్పావు ఛాంబర్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్, డీఎంకే మిత్రపక్షాల నేతల సమక్షంలో స్పీకర్ అప్పావు ఆయన చేత శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ముత్తుసామి, ఈవీ వేలు, డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్‌తిరుమావళవన్, ఎండీఎంకే నేత వైగో, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత పి.షణ్ముగం, తమిళగ వాళ్వురిమై కట్చి నేత వేల్‌మురుగన్, అసెంబ్లీ కార్యదర్శి కె.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణగరుడ వాహనంలో కొలువైన నంబెరుమాళ్ - రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా శ్రీరంగనాథుడి రథోత్సవం

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భూలోకవైకుంఠంగా ఖ్యాతిగాంచిన వైష్ణవ క్షేత్రం శ్రీరంగం శ్రీరంగనాథస్వామివారి రథోత్సవం సోమవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. ఈ ఆలయంలో తై మాస రథోత్సవ వేడుకలు ఈ నెల 2న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ స్వామివారు వివిధ వాహనాల్లో ఊరేగుతున్నారు. ఈ నెల 5న నంబెరుమాళ్ స్వర్ణగరుడ వాహనంలో ప్రధాన వీధుల్లో ఊరేగారు. ఉత్సవాల ఎనిమిదోరోజైన ఆదివారం సాయంత్రం స్వర్ణ అశ్వవాహనంలో బయలుదేరి ఉత్తర వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ప్రధాన ఘట్టమైన 'తై రథోత్సవం' సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నంబెరుమాళ్ ఉభయనాచ్చియార్లతో వేకువజాము 4.30 గంటలకు అద్దాల మండపం నుండి బయలుదేరి 5 గంటల ప్రాంతంలో 'తైతేర్ మండపానికి వేంచేశారు. ఆ తరువాత 5 నుండి 5.45 గంటల వరకూ రథారోహణం నిర్వహించారు. ఆ తర్వాత అలంకరించిన మహారథంపై నంబెరుమాళ్ ఉభయనాచ్చియార్లతో ఆశీనులయ్యారు. ఉదయం 6.15 గంటలకు ఆలయ నిర్వాహకులు పచ్చజెండా ఊపగా ఇరువైపులా నిలిచిన వేలాదిమంది భక్తులు 'రంగా.. రంగా... శ్రీరంగా' అంటూ కీర్తిస్తూ మోకుతాళ్లు పట్టుకుని లాగారు. ఆలయ చతుర్మాడవీధుల్లో రథం ఊరేగుతుండగా స్థానికులు స్వామివారికి కర్పూరనీరాజనాలు సమర్పించారు. ఇక మంగళవారం సప్తవర్ణమహోత్సవం జరుగనుంది. ఈ నెల 12 మధ్యాహ్నం 3 గంటలకు నంబెరుమాళ్ మూలస్థానం నుండి బయలుదేరి సాయంత్రం రంగవిలాసమండపంలో వేంచేసి, భక్తులకు దర్శనమివ్వడంతో ఈ తై రథోత్సవాలు ముగియనున్నాయి.

ఢిల్లీలో అన్నాడీఎంకే కార్యాలయం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యాలయం ప్రారంభిస్తున్న ఈపీఎస్, చిత్రంలో మాజీ మంత్రులు, నాయకులు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రూ.10 కోట్ల నిర్మించిన అన్నాడీఎంకే కార్యాలయాన్ని సోమవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రారంభించారు. ఢిల్లీలో అన్నాడీఎంకే కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని 2012లో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జయలలిత నిర్ణయం తీసుకున్నారు. దానికోసం ఢిల్లీ ఎంబీ రోడ్డు పుష్ప విహార్ సెక్టార్ 6వ బ్లాక్‌లో స్థలం కొనుగోలు చేశారు. అనంతరం 2015 అక్టోబరు 5వ తేది కార్యాలయ భవన నిర్మాణానికి జయలలిత భూమి పూజ చేశారు. మూడంతస్తుల అధునాతన వసతులతో ఈ భవనం నిర్మించారు. ఈ భవనానికి 'పురట్చితలైవర్ ఎంజీఆర్-పురట్చితలైవర్ జయలలిత మాళిగై' అనే పేరు పెట్టారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఢిల్లీలోని కార్యాలయాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు జయకుమార్, వేలుమణి, తంగమణి, పొన్నయ్యన్, గోకుల ఇందిర, వలర్మతి, నత్తం విశ్వనాధన్, సెల్లూరు రాజు, పొల్లాచ్చి జయరామన్, పార్టీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రన్‌వే అభివృద్ధిపై దృష్టి

● ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీలో చర్చ
● నివాస ప్రాంతాలకు హాని లేకుండా చర్యలు ● ఎంపీ టీఆర్ బాలు ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలు, పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు

అడయార్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో రెండో రన్‌వేను మరింత అభివృద్ధి చేసే అంశంపై ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ దృష్టి సారించింది. సోమవారం సమావేశమైన ఈ కమిటీ రన్‌వే అభివృద్ధిపైనే కీలకంగా చర్చ జరిపింది. రన్‌వే అభివృద్ధి చేసే విషయంలో స్థానికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, ఎంపీ టీఆర్ బాలు ఆదేశించారు. ఎయిర్‌పోర్టులోని కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అడ్వయిజరీ కమిటీ సభ్యులు, ఎయిర్‌పోర్టు ఉన్నతాధికారులు, ఎంపీ విజయ్ వసంత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. టీఆర్ బాలు మాట్లాడుతూ.. రెండో రన్‌వేను మరింతగా అభివృద్ధి చేసే అంశంపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. అయితే దీనివలన కొడంబాక్కం ప్రాంత ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని ఆయన కోరారు. ఇదిలావుండగా చెన్నై ఎయిర్‌పోర్టులో ప్రస్తుతం 3.66 కిలోమీటర్ల రన్‌వే ఒకటి, 2.89 కిలోమీటర్లతో రెండో రన్‌వే ఉంది. ఇందులో మొదటి రన్‌వేలో భారీ విమానాలు టేకాఫ్, టేకాన్ అవుతుంటాయి. రెండో రన్‌వేలో చిన్నతరహా విమానాలకు ఉపయోగిస్తుంటారు. ఈ రెండో రన్‌వేను మరింత అభివృద్ధి చేసి, భారీ విమానాలు దిగేలా చర్యలు తీసుకోనున్నారు. ఇదే అంశంపై చర్చించేందుకు ఎయిర్‌పోర్టు అడ్వయిజరీ కమిటీ సమావేశమైంది. ఇందులో పలు అంశాలపై చర్చించారు. కొలంబాక్కం గ్రామంలో ఎత్తైన భవాలను గుర్తించి, వాటి ఎత్తు రెండడుగుల మేరకు తగ్గించాలని వాటి యజమానులకు జిల్లా కలెక్టర్ తరఫున నోటీసులు పంపించాలని అడ్వయిజరీ కమిటీ సూచన చేసింది. ఇపుడు ఎయిర్‌ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న 278 భవనాలున్నట్టు గుర్తించారు. వీటిలో విమానాశ్రయానికి చెందిన 18 భవంతులు కూడా ఉన్నాయి. ఇవన్నీ తొలగించి రెండో రన్‌వేను సిద్ధం చేయాలని కమిటీ సలహా ఇచ్చింది.

కులాలవారీగా జనగణన చేపట్టండి

● లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన ● పీఎంకే నేత అన్బుమణి హెచ్చరిక

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులాలవారీ జనగణనను ప్రభుత్వమే చేపట్టాలని, లేనిపక్షంలో త్వరలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ హెచ్చరించారు. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం కులగణను కేంద్ర ప్రభుత్వమే జరపాలని కోరటం హాస్యాస్పదంగా ఉందని, తెలంగాణా ప్రభుత్వం 30 రోజుల్లోనే కులగణన పూర్తి చేసిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సోమవారం టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కులగణన కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై పార్టీ సామాజిక న్యాయ విభాగం సమావేశం జరిగింది. అన్బుమణి రాందాస్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పురట్చిభారతం అధ్యక్షుడు పూవై జగన్‌మూర్తి, న్యూజస్టీస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సమరసం, ఇందియ జననాయగ కట్చి అధ్యక్షుడు రవి పచ్చముత్తు న్యాయవాద విభాగం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బాలు, తమిళనాడు నాడార్ల సంఘం అధ్యక్షుడు ముత్తు రమేష్, యాదవ మహాసభ ప్రతినిధి సేతుమాధవన్, దక్షిణ భారత ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు తిరుమారన్, కొంగు మక్కల్ మున్నని సమన్వయకర్త ఆరుముగం, తమిళర్ దేశం కట్చి నాయకుడు కేకేఎస్ సెల్వకుమార్, కేంద్ర మాజీ మంత్రి ఏకే మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అన్బుమణి మాట్లాడుతూ... రాష్ట్రంలో కులాలవారీ జనగణనపై ముఖ్యమంత్రి స్టాలిన్ కపటనాటకమాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఒడిశా, బీహార్, తెలంగాణా తదితర రాష్ట్రాల్లో కులాలవారీ జనగణన అత్యంత సులువైన పద్ధతిలో వేగవంతంగా ముగిసిందన్నారు. ఇన్ని రాష్ట్రాలు కులాలవారీ జనగణన జరుపుతుంటే రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం తటపటాయిస్తుండటం గర్హనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కులాలవారీ జనగణనను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టనున్నామని ఆయన ప్రకటించారు.



పీఎంకే న్యాయవాదుల విభాగ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అన్బుమణి

క్రీడాకారులకు నగదు పురస్కారాలు

● క్రికెటర్ కమలిని, ఖోఖో ఆటగాడు సుబ్రమణికి రూ.25లక్షల చొప్పున అందజేత



క్రికెటర్ కమలిని తల్లిదండ్రులకు రూ.25లక్షల చెక్కు అందజేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన ఇద్దరు క్రీడాకారులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తలా రూ.25 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు. మలేసియాలో జరిగిన టీ20 మహిళల వరల్డ్ కప్ క్రికెట్ విజేత భారత జట్టు సభ్యురాలు కె.కమలినికి, ఢిల్లీలో జరిగిన ఖోఖో ప్రపంచ కప్ పురుషుల విభాగంలో భారత జట్టు గెలిచేందుకు కీలకపాత్ర పోషించిన వి. సుబ్రమణికి ఈ నగదు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు సచివాలయంలో సోమవారం ఉదయం యువజన సంక్షేమం, క్రీడాశాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమలిని తరఫున ఆమె తల్లిదండ్రులు ముఖ్యమంత్రి నుండి రూ.25లక్షల చెక్కు అందుకున్నారు. ఖోఖో క్రీడాకారుడు సుబ్రమణి సీఎంను కలిసి రూ.25లక్షల చెక్కు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

మేట్టూరు డ్యామ్‌లో పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు డ్యామ్‌లో రెండు రోజులుగా ఇన్‌ఫ్లో అధికమైంది. శనివారం ఆ డ్యామ్‌లోకి సెకనుకు 155 ఘనపుటడుగులు చొప్పున అదనపు జలాలు ప్రవేశించాయి. ఆదివారం సాయంత్రం సెకనుకు 317 ఘనపుటడుగులుగా ఇన్‌ఫ్లో పెరిగింది. ఆ డ్యామ్ నుండి పంటల సాగుకోసం సెకనుకు 500 ఘనపటుడుగుల జలాలను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆ డ్యామ్‌లో 78.86 టీఎంసీల మేరకు జలాలు ఉన్నాయని ఇరిగేషన్ విభాగం అధికారులు తెలిపారు.

తైపూస ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పళని తైపూసం ఉత్సవాల సందర్భంగా మదురై-పళని మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రసిద్ధిగాంచిన పళని మురుగన్ ఆలయ ఉత్సవాలు ఈ నెల 5వ తేదీ ప్రారంభమై 10 రోజుల పాటు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 11,12 తేదీల్లో మదురై నుంచి ఉదయం 8.45 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు 11.30 గంటలకు పళని చేరుకుంటుంది. మరుమార్గంలో పళని నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.45 గంటలకు మదురై చేరుకుంటుంది. అలాగే, భక్తుల సౌకర్యార్థం తిరుచ్చి, మదురై, కోవై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

21న సీఎం స్టాలిన్ కడలూరు పర్యటన

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర పరిశీలన కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 21, 22 తేదీల్లో కడలూరు జిల్లాలో పర్యటించనున్నారు. కడలూరు జిల్లాలో పూర్తయిన పథకాలను ప్రారంభించి, కొత్తగా చేపట్టనున్న పథకాలకు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులతో ఆయన సమావేశమై ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును గురించి చర్చలు జరుపనున్నారు.

రేపటి నుంచి నాగై-శ్రీలంక నౌకాయానం

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం-శ్రీలంక మధ్య ప్రయాణికుల నౌక సేవలు బుధవారం నుండి ప్రారంభం కానున్నాయి. నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు 2023 అక్టోబరు 14వ తేది నుంచి ప్రయాణికుల నౌక సేవలు ప్రారంభమయ్యాయి. తుఫానులు, అల్ప పీడనం, రుతుపవనాల ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో ఈ సేవలు నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో బుధవారం నుంచి నౌక సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

13న రవాణా కార్మికుల వేతన ఒప్పంద చర్చలు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖలో పనిచేస్తున్న కార్మికుల 15వ వేతన ఒప్పంద చర్చలు ఈ నెల 13వ తేది జరుగనున్నాయి. రవాణా శాఖ కార్మికులకు మూడేళ్లకు ఒకసారి వేతన సవరణ చేపడుతుంటారు. ఈ ప్రకారం, 15వ వేతన పెంపునకు సంబంధించి ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసింది. ఈ కమిటీ తొలివిడత చర్చలు ఇటీవల జరుగగా, సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాలు పలు సూచనలు చేశాయి. ఈ నేపథ్యంలో, రెండో విడత చర్చలు ఈ నెల 13న క్రోంపేటలోని ఎంటీసీ శిక్షణా కేంద్రంలో ఉదయం 11 గంటలకు జరుగుతాయని, ఈ సమావేశంలో పాల్గొనాలని గుర్తింపు పొందిన కార్మిక సంఘాలకు ఆహ్వానం పంపినట్లు అధికారులు తెలిపారు.

తిరువళ్లూర్‌లో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో నమోదవుతున్న పోక్సో కేసులను విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేశారు. తిరువళ్లూర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ ప్రత్యేక న్యాయస్థానాన్ని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జె.జూలియట్ పుష్ప ప్రారంభించారు. లైంగిక వేధింపుల కేసులు ప్రస్తుతం మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో జరుగుతున్నాయి. ఈ క్రమంలో, కొత్తగా ప్రారంభించిన పోక్సో ప్రత్యేక కోర్టులో మహిళా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణలో ఉన్న అన్ని పోక్సో కేసులు విచారించనున్నారు. ఈ ప్రత్యేక కోర్టు సోమవారం తొలి కేసును న్యాయమూర్తి సరస్వతి విచారించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కలైంజర్ సెంటినరీ మైదానంలో జల్లికట్టు పోటీలు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మదురై అలంగానల్లూర్ పంచాయతి యూనియన్ కీళక్కరైలో కొత్తగా ఏర్పాటుచేసిన కలైంజర్ సెంటినరీ మైదానంలో ఈ నెల 11,12 తేదీల్లో జల్లికట్టు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను వాణిజ్యపన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మూర్తి ప్రారంభించనున్నారని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే ఎద్దులు, క్రీడాకారుల నమోదు జరిగిందని అధికారులు తెలిపారు.

బస్సులో సీటు కోసం పట్టా కత్తులు....!

● భీతిల్లిన ప్రయాణికులు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చిలో బస్సులో సీటు కోసం పట్టా కత్తులు వేయడంతో ప్రయాణికులు బెంబేలెత్తారు. పొల్లాచ్చి బస్టాండ్ నుంచి బస్సులు నడుస్తుంటాయి. ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులతో బస్సులు కిటకిటలాడుతుంటాయి. బస్టాండ్‌లో వేచి ఉన్న వారు బస్సు వచ్చిన వెంటనే సీటు కోసం తమ బ్యాగులు, కర్చీఎలు వేస్తుంటారు.. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం ప్రభుత్వ బస్సుల్లో సీటు కోసం కొందరు రెండు పట్టా కత్తులు వేయడంతో ప్రయాణికులు హడలిపోయారు. ఈ వ్యవహారంపై పొల్లాచ్చి తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు.


సీటు కోసం వేసిన పట్టా కత్తులు

అయ్యప్పన్‌తాంగల్‌లో వీజీఎన్ గ్రాండియర్

ప్యారీస్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ సమీపంలోని అయ్యప్పన్‌తాంగల్ ప్రాంతంలో వీజీఎన్ గ్రాండియర్ గృహప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 30ఎకరాల విస్తీర్ణంలో ఇంటిప్లాట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు ఆ సంస్థ చైర్మెన్ వీఎన్ దేవదాస్ ప్రకటించారు. తమిళనాడు ప్రభుత్వ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరి అథారిటీ, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నుంచి పొందిన అనుమతులతో అయ్యప్పన్ తంగల్‌లో 500గృహాలను ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా 500 చదరపు అడుగుల నుండి 3వేల చదరపు అడుగులతో నిర్మాణాలు జరుగుతాయని వివరించారు. ప్లాట్ల ధర రూ.54లక్షల నుండి రూ.2.74కోట్ల వరకు ఉంటుందని దేవదాస్ తెలిపారు.

సీఎండీఏలో 64 రోజులకు నిర్మాణ అనుమతులు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ)లో కొత్తగా చేపట్టే నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల గడువును 180 రోజుల నుంచి 64 రోజులకు తగ్గించారు. నగరంలో భవనాలు, ఇళ్లు, వ్యాపార కాంప్లెక్స్ తదితరాలు నిర్మాణాలకు సీఎండీఏ అనుమతులు తప్పనిసరి. భవనం నిర్మించే ప్రాంతానికి సంబంధించిన అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, దరఖాస్తుల పరిశీలన కోసం ఆయా ప్రాంతాలకు అధికారులు వెళ్లి పరిశీలించిన అనంతరం 180 రోజుల్లో అనుమతులిస్తుంటారు. ఈ గడువు అధికంగా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో, అనుమతులిచ్చే గడువు 64 రోజులకు తగ్గించినట్లు అధికారులు తెలిపారు.

తిరుత్తణి రోడ్లపై స్తంభించిన ట్రాఫిక్

తిరుత్తణి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయానికి ప్రతిరోజూ దక్షిణాది రాష్ట్రాల నుండి భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో తిరుత్తణి ఆలయంలో సోమవారం ఉదయం 50కి పైగా వివాహాలు జరిగాయి. దీంతో కొండపైకి వచ్చే వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వెళ్లే భక్తుల కోసం వేరే దారి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పడవ నుండి జారిపడి జాలరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడుకు చెందిన జాలరి పడవ నుంచి జారిపడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... ఆంధ్ర రాష్ట్రం ఒంగోలు ప్రాంతానికి చెందిన వెంకటరావు, కాశిమేడులో నివాసం ఉంటూ సెల్వమగన్‌కు చెందిన పడవలో సముద్రంలోకి వెళ్లి చేపల వేట సాగిస్తుంటాడు. ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్లిన వెంకటరావు తీరానికి తిరిగి రాకపోవడంతో సహచర జాలర్లు మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. ఈ నేపథ్యంలో, సోమవారం కాశిమేడు సముద్రతీరానికి వెంకటరావు మృతదేహం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న కాశిమేడు హార్బర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన పూజారి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన పూజారిని పోలీసులు అరెస్ట్ చేశారు. దిండుగల్ జిల్లా కోట్టాండి సమీపంలో ఓ వ్యక్తి (55) జ్యోతిష్యం చెబుతుంటాడు. జ్యోతిష్యానికి వచ్చిన ఓ బాలికపై అతడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తల్లిదండ్రులు నీలకోట మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా, ఆ వ్యక్తి మరో ఇద్దరు బాలికలపై కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

విదేశాలకు తక్కువ రుసుముతో పార్శిల్ సేవలు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ద్వారా తక్కువ రుసుముతో విదేశాలకు పార్శిళ్లు పంపించవచ్చని తమిళనాడు ప్రాంతీయ తపాలా శాఖ మేనేజర్ మరియమ్మ థామస్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 66 పార్శిల్ సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ద్వారా సుమారు 540 మంది వినియోగదారులు 20వేలలకు పైగా పార్శిళ్లు పంపుతున్నారన్నారు. ఈ సేవలు విస్తరించేలా విదేశాలకు కూడా తక్కువ ఖర్చుతో పార్శిల్ పంపేలా చర్యలు చేపట్టామన్నారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు, స్వయం సహాయక బృందాలు తయారుచేసే ఆహార పదార్థాలు, పలురకాల వస్తువులను తక్కువ ఖర్చుతో విదేశాలకు పంపించవచ్చని తపాలా శాఖ తెలియజేసింది.

● ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి పథకం..

మూడేళ్లుగా రూ.184కోట్లు ఆపిన కేంద్రం

ప్యారీస్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల కోసం ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన (పీఎంఏజీవై) పథకానికి ఇవ్వాల్సిన రూ.184 కోట్లను గత మూడేళ్లుగా రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం విడుదల చేయలేదని సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ)లో వెలుగు చూసింది. మదురైకి చెందిన సంఘసేవకుడు కార్తిక్ ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు తమిళనాడు ఆదిద్రావిడ సంక్షేమ డైరెక్టరేట్ సమాచారం తెలిపింది. ఇందులో పీఎంఏజీవై పథకం కింద 2021నుండి 2024వ సంవత్సరం వరకు మూడేళ్లుగా రూ.184కోట్ల 23లక్షలను కేంద్రప్రభుత్వం విడుదల చేయకుండా నిలిపివేసినట్లు వుంది. దేశంలో కేంద్రప్రభుత్వం 2009 - 2010వ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, విద్యా తదితర జీవన శైలిని మెరుగుపరచాలనే లక్ష్యంతో పీఎంఏజీవై పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నిధులతో ఈ వర్గాల ప్రజలు నివసించే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుపరిచి ఆదర్శ గ్రామం (మోడల్ విలేజ్) రూపొందించాల్సివుంటుంది. ఈ ఆదర్శ గ్రామాల్లో చేతి వృత్తుల్లో ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేసి వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణా తరగతులు నిర్వహించాలి. అయితే గత మూడేళ్లుగా కేంద్రప్రభుత్వం పీఎంఏజీవై పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీలు నివశించే ప్రాంతాల్లో అభివృద్ధి పనులు స్తంభించినట్లు ఆర్టీఐ చట్టం కింద పొందిన సమాచారం స్పష్టం చేసింది. దీనిపై కార్తిక్ మాట్లాడుతూ, గత మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వం నుండి వెంటనే నిధులు పొందేలా డీఎంకే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

● పొగమంచు ఎఫెక్ట్...

విమానాల రాకపోకల్లో జాప్యం

అడయార్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ విపరీతమైన మంచు కురుస్తోంది. దీని కారణంగా విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన సర్వీసులకు పొగమంచు అంతరాయాన్ని కలిగిస్తుంది. రెండు రోజుల క్రితం దట్టంగా పొగమంచు కమ్మేయడంతో పది విమానాలు టేకాఫ్ కాలేకపోయాయి. అలాగే, 48కిపైగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా సోమవారం ఉదయం కూడా పొగమంచు కారణంగా ఏడు విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు రావాల్సిన ఓమన్ విమానం 9 గంటలకు, 7.20 గంటలకు రావాల్సిన మస్కట్ విమానం ఉదయం 10.20 గంటలకు, కౌలాలంపూర్ నుంచి ఉదయం 7.25 గంటలకు రావాల్సిన విమానం 8.30 గంటలకు వచ్చాయి. దీంతో ఈ విమానాలు తిరిగి బయలుదేరి వెళ్లడంలో జాప్యం జరిగింది. అలాగే, కొన్ని స్వదేశీ విమాన సర్వీసులు కూడా ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి.

బ్యానరుపై ఫొటో వేసేందుకు కూడా భయపడుతున్నారు

● మాజీ మంత్రి గోకుల ఇందిర

అడయార్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యక్రమాల కోసం వేసే బ్యానర్లలో ఒక మూల తన ఫొటోను ముద్రించేందుకు కూడా భయపడుతున్నారని అన్నాడీఎంకే మాజీ మంత్రి, సీనియర్ మహిళా నేత గోకుల ఇందిరా అన్నారు. తాజాగా అన్నానగర్‌లో జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నిజాయితీ ప్రతి ఒక్క చోటా చూపించాలన్నారు. తనను చూసి అనేక మంది నమస్కారం పెట్టేందుకు కూడా జంకుతున్నారన్నారు. అభ్యర్థిగా ఎవరైనా రావొచ్చన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీటు కావాలని అడిగే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. అలాగే, సీటును ఎవరికైనా కేటాయించు హక్కు పార్టీ ప్రధాన కార్యదర్శికి ఉందన్నారు. సెంట్రల్ చెన్నై ఇన్‌చార్జిగా తనను నియమించిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు అనేక మంది తనను ఆహ్వానించారన్నారు. కానీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు తాను పాల్గొనడం లేదన్నారు. అన్నానగర్ నియోజకవర్గ ఎన్నికల వ్యవహారాల్లో కూడా తలదూర్చడం లేదంటూ సంచన వ్యాఖ్యలు చేశారు.

పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యలు

● సీమాన్‌కు వడలూరు పోలీసుల సమన్లు

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ ఉద్యమనేత పెరియార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వడలూరు పోలీసులు నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్‌కు సమన్లు పంపించారు. ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. ఇటీవల సీమాన్ వడలూరు సత్యజ్ఞాన సభను సందర్శించినప్పుడు మీడియాతో మాట్లాడుతూ పెరియార్‌ను కించపరిచేలా విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ద్రావిడ కళగం స్థానిక నాయకులు, పెరియార్ అభిమానులు పలువురు సీమాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అక్కడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. వాటిని నమోదు చేసుకున్న పోలీసులు ప్రస్తుతం సీమాన్‌కు సమన్లు పంపించారు. వడలూరు పోలీసులు సోమవారం ఉదయం నీలాంగరై ప్రాంతంలో ఉన్న సీమాన్ నివాసగృహానికి వెళ్లి ఆ సమన్లను అందించారు.

గంజా చాక్లెట్లు విక్రయిస్తున్న మహిళ సహా ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న మహిళ సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఎగ్మూర్ పోలీసులకు అందిన సమాచారంతో శనివారం రాత్రి పుదుపేట సౌత్ కూవం రోడ్డులోని మురుగునీటి శుద్ధీకరణ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ సందేహాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా, పురుషవాక్కం తాండవరాయన్ వీధికి చెందిన భానుమతి అలియాస్ ఉష (42), పల్లవన్ రోడ్డు గాంధీ నగర్‌కు చెందిన గోకులకృష్ణన్, కాంచీపురం జిల్లా పెరుంబాక్కంకు చెందిన బాలాజి అని తెలిసింది. వారి బ్యాగులు పరిశీలించిన పోలీసులు, 41 గంజాయి చాక్లెట్లు, 2,950 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, కత్తి, ద్విచక్రవాహనం, రూ.60,880 నగదు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ తెలిపింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతి


మృతి చెందిన బంగారు సారంగన్

తడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ మృతిచెందాడు. తమిళనాడు గుమ్మిడిపూడి తాలూకా సామిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన బంగారు సారంగన్ (55) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం ఉదయం 6 గంటలకు పన్నంగాడు వద్ద కూలి పనికి బయలుదేరాడు. జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన బంగారు సారంగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలింజిన్‌లో చిక్కి వృద్ధుడి మృతి

అడయార్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్‌పాడి-బేసిన్‌బ్రిడ్జి ప్రాంతాల మధ్య రైలింజిన్‌లో చిక్కి ఒకవృద్ధుడు మరణించాడు.పోలీసుల కథనం మేరకు తిరువనంతపురం నుంచి బేసిన్‌బ్రిడ్జికి ఉదయం 9.55 గంటలకు ఒక ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చింది. ఆ సమయంలో 67 ఏళ్ల వృద్ధుడు పట్టాలు దాటేందుకు ప్రయత్నించి, రైలింజిన్‌కింద చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈవిషయాన్ని పెరంబూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడిని పులియంతోపు ప్రాంతానికి చెందిన మహిమైరాజ్(67)గా గుర్తించారు.

వెయ్యి ప్రాంతాల్లో విపత్తుల హెచ్చరిక పరికరాల ఏర్పాటు

ప్యారీస్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరదలు, భూప్రకంపనలు, సముద్రంలో అలల ఉద్రుతి తదితర విపత్తుల గురించి ముందుగానే హెచ్చరించేలా డిజైన్ చేసిన పరికరాలను రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, విపత్తుల శాఖలు ప్రణాళిక రూపొందించాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఊహించని విధంగా పలుప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. వీటి కారణంగా ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారు. అసలు ఈ విపత్తులు ఎలా ఏర్పడుతున్నాయి?, ఎక్కడ?, ఎప్పుడు? అన్న సమాచారాన్ని సంబంధిత ప్రాంతాల ప్రజలకు తెలియజేసేలోగా నష్టం జరుగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గత సంవత్సరం ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి సమీపంలో తీరం దాటే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సహజంగా ఇలాంటి తుఫానులు తీరం దాటిన తర్వాతే బలహీనపడుతుంటాయి. ఆ నమ్మకంతోనే ఫెంగల్ వచ్చిన ఎలాంటి నష్టం జరగబోదని ప్రజలు నమ్మారు. అయితే వాతావరణశాఖ ప్రకటించిన విధంగా కాక, ఫెంగల్ తుఫాను తీరం దాటిన తర్వాత కూడా బలహీనపడకుండా సముద్రంలో ఒకే ప్రాంతంలో గంటల తరబడి స్థిరంగా ఉండిపోయింది. దీని ప్రభావం వల్ల విల్లుపురం, కడలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లో కుండపోత వర్షం కురిసింది. తిరువణ్ణామలైలో మట్టిచర్యలు విరిగిపడి, బండరాళ్లు దొర్లిపడి జనజీవనం స్తంభించింది. ఒక్కొక్క సంవత్సరం ఇలాంటి విపత్తులు సంభవించే సమయాల్లో బాధిత ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే హెచ్చరించివుంటే బాగుండేదని ప్రభుత్వానికి నిపుణులు సలహాలిచ్చేవారు. ఈ సలహా పరిశీలించిన ప్రభుత్వం విపత్తులను పసిగట్టగలిగే హెచ్చరిక పరికరాలను పొందుపరచాలని నిర్ణయించింది. రాష్ట్రంలో చెరువులు, ఆనకట్టలు, జలపాతాలు, అలాగే నీటి పరీవాహక జిల్లా సరిహద్దుల్లో నివసిస్తున్న ప్రజలను ఈ పరికరాలు ముందుగానే హెచ్చరించేలా డిజైన్ చేశారు. రూ.13.25కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ఈ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతం ఈ పరికరాలను పొందుపరచే ప్రాంతాల ఎంపిక పనులు వేగవంతం చేసినట్లు రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖ అధికారులు తెలిపారు.

అంబులెన్స్ ఉద్యోగుల నిజాయితీ

పెరంబూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి, టాస్మాక్ దుకాణంలో వసూలైన రూ.5.62 లక్షలను అంబులెన్స్ సిబ్బంది నిజాయితీగా అప్పగించారు. సేలం సమీపంలోని టాస్మాక్ దుకాణంలో వసూలైన నగదును సిబ్బంది కుళందైవేలు, మకుటేశన్ ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారు.కొండాలంపట్టి బైపాస్‌మీదుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో వీరిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న టాస్మాక్ ఉద్యోగుల బ్యాగు పరిశీలించగా, అందులో రూ.5.62 లక్షలను గమనించిన అంబులెన్స్ ఉద్యోగులు ఆదికేశవన్, నటేశన్ వాటిని పోలీసులకు అందజేశారు. పోలీసులు నగదును టాస్మాక్ అధికారులకు అప్పగించారు. అంబులెన్స్ ఉద్యోగుల నిజాయితీని పోలీసులు, అధికారులు అభినందించారు.


అధికారులకు నగదు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

హారతిపళ్లెంలో పడే కాసులు హుండీలో వేయాలి

● మురుగన్ ఆలయ అధికారి వింత ఉత్తర్వు

● నిరసనలతో ఉపసంహరణ

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మదురై నేతాజీ రోడ్డులోని దండాయుధపాణి మురుగన్ ఆలయ కార్యనిర్వహణాధికారి అంగయర్కన్ని చేసిన ఓ ఉత్తర్వు రాష్ట్రంలోని అర్చకులు, పూజారులకు దిగ్భ్రాంతి కలిగించింది. ఆదివారం సాయంత్రం ఆమె ఉన్నట్టుండి ఆలయంలో వివిధ సన్నిధుల్లో ఉన్న పూజారులు భక్తులు హారతి పళ్లెంలో వేసే నగదు కానుకలను హుండీలోనే వేయాలని ఆదేశించారు. తన ఉత్తర్వు సక్రమంగా అమలవుతుదో లేదో సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘా వేయాలని కూడా ఆదేశించారు. ఈ ఉత్తర్వు జారీ అయిన గంటలోపే రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పనిచేసే ముఖ్యంగా ఏకకాల పూజలతో నడిచే ఆలయాలకు చెందిన పేద పూజారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతే కాకుండా ఆ ఆలయ అధికారి ఇచ్చిన ఉత్తర్వు నకలు రాత్రంతా సామాజిక ప్రసారమాధ్యమాల్లో విడుదలై అర్చకులు, పూజారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేసింది. చివరకు సోమవారం ఉదయం ఆ ఉత్తర్వును వాపసు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. దండాయుధపాణి ఆలయం ట్రస్టుబోర్డు అధ్యక్షులు, తక్కర్‌తో సంప్రదించకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఆ ఉత్తర్వు జారీ చేశారని దేవాదాయ శాఖ కూడా పేర్కొంది. చివరకు ఆమె తన ఉత్తర్వును ఉపసంహరించుకున్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ఆమెకు సంజాయిషీ నోటీసు కూడా జారీ చేసింది.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా 12తేదీ బుధవారం దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పొన్నేరి: అళింజివాక్కం, అత్తిపేడు, ఇరుళిపట్టు, జనపసత్రం, జంక్షన్ రోడ్డు, పెరియపాళయం రోడ్డు, జగన్నాధపురం రోడ్డు, సాయి కృప నగర్, విరుందావన్ నగర్, ఎంకే గార్డెన్, శ్రీ నగర్, ఎస్పీ పార్క్, మల్లివాక్కం, ఆమూర్, జగన్నాథపురం సత్రం, కుదిరైపల్లం

తేనాంపేట: పోయస్ గార్డెన్, తిరువళ్లువర్ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ రోడ్డు, రాజకృష్ణా రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలని, కేబీ దాసన్ రోడ్డు, భారతియార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, ఆర్టీఓటీ, కథిడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారధి పేట, గార్డెన్, కేఆర్ రోడ్డు, జార్జి అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్కే కాలని, అన్నాసాలై ప్రాంతం, వీనస్ కాలని, మూర్‌రేస్ గేట్ రోడ్డు

తిరుముల్లైవాయల్: మోరై, మాతా ఆలయం, అన్నానగర్, వీరాపురం, తిరుమలై నగర్, మకరల్, కొళక్కుంబేడు, తామరైపాక్కం, కారణి, కరలంబాక్కం, కావనూరు, కేటీపీ రోడ్డు, మేల్ కొండయార్, కథవూర్, వేళచ్చేరి, పొత్తూర్, పొక్కిషం భూమి నగర్, కన్నడపాళయం, శివ గార్డెన్, చెల్లిఅమ్మన్ నగర్, లక్ష్మి నగర్, ఆర్కేజీ వల్లివేల్ నగర్, తాయ్ నగర్, అలమాది, ఏటీసీ కాలని, వెన్మణి నగర్

మొగప్పేర్ ఈస్ట్: తిరువళ్లువర్ రోడ్డు, మగళచ్చి కాలని, గార్డెన్ అవెన్యూ, స్పార్టన్ అవెన్యూ, టీచర్స్ వీధి, వేళమ్మాళ్ స్కూల్ రోడ్డు, జెన్ ఫౌండేషన్ పొన్నియమ్మన్ నగర్ వళ్లలార్ వీధి, కామరాజ్ వీధి, వీకేఎం రోడ్డు, స్కూల్ రోడ్డు, ఇందిరా గాంధీ వీధి, ఇరుళర్ వీధి, స్కూల్ రోడ్డు, ఎట్టీశ్వరన్ ఆలయ వీధి, వైష్ణవి నగర్

మద్రాస్ వర్శిటీ తెలుగుశాఖలో

● రేపటి నుంచి 'ధర్మనిధి ఉపన్యాసాలు'

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు 'ధర్మనిధి ఉపన్యాసాలు' జరుగనున్నాయి. తొలిరోజు ఉదయం 10.30 గంటలకు మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో జరిగే ప్రారంభ సమావేశానికి తెలుగుశాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనుండగా, డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలుకనున్నారు. ప్రముఖ గాయని అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారంభం కానున్న ఈ సమావేశానికి రచయిత్రి ఎల్పీ సుజాత ముఖ్య అతిథిగా, తెలుగుశాఖ మాజీ అధ్యక్షులు దివంగత జీవీఎస్ఆర్ సతీమణి గోపాలుని హైమావతి విశిష్ట అతిథిగా, తెలుగు భాషాసేవకురాలు డాక్టర్ ఏవీ శివకుమారి ప్రత్యేక అతిథిగా హాజరుకానుండగా, రాజధాని కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ హెచ్.అనిందిత ప్రారంభోపన్యాసం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 'ఆర్కాటు ప్రకాశరావు ధర్మనిధి ఉపన్యాసం', 2 గంటలకు 'ఆచార్య జీవీఎస్ఆర్ కృష్ణమూర్తి ధర్మనిధి ఉపన్యాసం', ఆ తరువాత 'ఎన్ఆర్ చందూర్ స్మారక ధర్మనిధి ఉపన్యాసం' జరుగనున్నాయి. రెండో రోజైన గురువారం ఉదయం 10.30 గంటలకు 'ఆచార్య గంధం అప్పారావు ధర్మనిధి ఉపన్యాసం', ఆ తరువాత 'ములకుమూడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసం', 2 గంటలకు 'ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ధర్మనిధి ఉపన్యాసం' జరుగనుండగా, సాయంత్రం 3 గంటలకు ముగింపోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమానికి రాజధాని కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఎం.ఆంబ్రూజీ ముఖ్య అతిథిగా, రచయిత్రి క్రొవ్విడి రమాదేవి ప్రత్యేక అతిథిగా, తెలుగు ఉపన్యాసకులు వల్లూరుగడ స్రవంతి ఆత్మీయ అతిథిగా హాజరుకానుండగా, ఆకాశవాణికి చెందిన పెద్దా సాయి సూర్య సుబ్బలక్ష్మి ధర్మనిధి ముగింపు సందేశం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులేనని ఆచార్య విస్తాలి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వీరప్పన్ బంధువు మృతిపై అనుమానం

● 30 ఏళ్ల అనంతరం విచారణకు ఆదేశించలేమన్న హైకోర్టు

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ బంధువు అర్జున్ అనుమానాస్పద మృతిపై 30 ఏళ్ల అనంతరం విచారణకు ఆదేశించలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. వీరప్పన్ బంధువు అర్జునన్, 1995 సెప్టెంబరులో విచారణ కోసం పోలీసులు తీసుకెళ్లగా, అప్పటి నుంచి కనిపించలేదు. ఈ నేపథ్యంలో, ధర్మపురి కోర్టులో అర్జునన్‌పై ఉన్న కేసుల విచారణ సమయంలో, అర్జునన్ మృతిచెందినట్లు పోలీసు శాఖ తరఫున అఫిడవిట్ దాఖలుచేయడంతో ఆయనపై ఉన్న కేసుల విచారణ ముగిసినట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతిపై విచారణ చేపట్టాలని, పోలీస్‌స్టేషన్‌లో అతను మృతిచెందిన కారణంగా రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరుతూ అర్జునన్ కుమారుడు సతీష్‌కుమార్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఈ కేసులో ఇరుతరపు వాదనల అనంతరం, 30 ఏళ్ల క్రితం జరిగిన ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించలేమని, పోలీసుల దాడిలో అర్జునన్ మృతిచెందినట్లు ఎలాంటి ఆధారాలు లేవంటూ న్యాయమూర్తి భరత్ చక్రవర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్ కొట్టివేసింది.

అన్నా సెంటినరీ లైబ్రరీలో డిజిటల్ టచ్ స్క్రీన్

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్టూరుపురంలోని అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయంలో కొత్తగా భారీ సైజు డిజిటల్ టచ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ టచ్ స్క్రీన్ ద్వారా సందర్శకులు తమకు నచ్చి దిన, వార, మాస పత్రికలను ఎంపిక చేసుకుని చదువుకోవచ్చునని గ్రంథాలయ అధికారులు తెలిపారు. ఆ గ్రంథాలయం వివరాలను కూడా టచ్‌స్క్రీన్ ద్వారా తెలుసుకోవచ్చునని, ఏయే శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలు ఏయే విభాగాల్లో ఉన్నాయనే విషయాలను క్షణాలలో తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు.

కోటపల్లి వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం


ఏనుగు దాడిలో విరిగిపోయిన మామిడిచెట్లు

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్ర జ్యోతి): చిత్తూరుజిల్లా పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. కోటపల్లి సరిహద్దులోని అటవీప్రాంతం నుంచి ఒంటరి ఏనుగు గ్రామంలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడితోటలోకి ప్రవేశించింది. ఆరు మామిడి చెట్లను విరిచేసింది. సమీపాల్లోని రైతుల మామిడిచెట్లను విరిచేసింది.

పల్లిక్కరణైలో విదేశీ విహంగాల సందడి

వలస వచ్చిన 60వేల రకాల పక్షులు ● ఆకట్టుకుంటున్న కింగ్‌ఫిషర్ అందాలు ● పూర్తయిన పక్షుల గణన



పల్లికరనైలో సేదతీరుతున్న విదేశీ పక్షులు

ప్యారీస్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ చెన్నై పరిధిలో పల్లిక్కరణై చిత్తడినేలలో కింగ్‌ఫిషర్ పక్షులను అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. ఈ శాఖ ది నేచర్ ట్రస్ట్ అనే సంస్థతో కలిసి వలసపక్షుల గణన ప్రక్రియను 2019వ సంవత్సరం నుండి కొనసాగిస్తోంది. 2019లో పల్లికరనైకు ఒకే నెలలో 41వేల విదేశీ విహంగాలు వలస రావడం సరికొత్త రికార్డు. పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగాంచిన పల్లికరనై సరస్సు వద్ద ప్రస్తుతం 60వేలకుపైగా పక్షులు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. రుతుపవనాల సీజన్‌లో పలు దేశాల నుండి చల్లటి వాతావరణాలన్ని ఆస్వాదించేందుకు పలు రాష్ట్రాలు, దేశాల నుండి పక్షులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వలస వచ్చి సంతానోత్పత్తిలో పాల్గొని, సీజన్ ముగిసాక తిరిగి ఆయా ప్రాంతాలకు వెల్లిపోతుంటాయి. దక్షిణ చెన్నైలో వేళచ్చేరి నుంచి పెరుంబాక్కం వరకు ఉన్న పల్లికరనైను చిత్తడినేలగా ప్రకటించారు. పరీవాహక ప్రాంతాల్లో మేతకోసం జనవరిలో 60,234కు పైగా పక్షుఉ ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది. గత 15ఏళ్లలో ఈ స్థాయిలో అధిక సంఖ్యలో వలస పక్షులు రావడం ఇదే మొదటిసారి. శీతాకాలం మొదలైయ్యే డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు పల్లిక్కరణై వచ్చే వలస పక్షుల సంఖ్య భవిష్యత్తులో కూడా మరింత పెరిగే అవకాశముందని గణనలో పాల్గొన్న నిపుణులు తెలిపారు. ప్రధానంగా ఉష్ణ, శీతోష్ణస్థితి మండలాలు, నదులు, సరస్సుల ప్రాంతాల్లో నివసించే అరుదైన కింగ్‌ఫిషర్ పక్షులు ప్రస్తుతం పల్లిక్కరణైలో సేదతీరుతున్నాయి. ఇక్కడి సరస్సులో చేపలు, చిన్న పాము పిల్లలు, కప్పలు, పురుగులు, ఇతర కీటకాలను ఆహారంగా తీసుకుంటున్నాయి. సీజన్‌లో మూడు నుండి 10వరకు గుడ్లు పెట్టి, సంతానోత్పత్తి చేస్తాయి. పల్లికరనై చిత్తలనేలల ప్రాంతం కావడంతో గూడబాతు, నెమలితోకబాతు సహా 120రకాలకు చెందిన దాదాపు 60వేలకు పైగా వలస పక్షులు సందడి చేస్తున్నాయి.





వడలూరులో తైపూస వేడుకల ప్రారంభం

నేటినుంచి జ్యోతి దర్శనాలు



వడలూరు సత్యజ్ఞాన సభ ప్రాంగణం వద్ద సన్మార్గ పతాకాన్ని ఎగురవేస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరు అరుళ్ ప్రకాశ వళ్లలార్ నెలకొల్పిన సత్యజ్ఞానసభలో సోమవారం ఉదయం తైపూస ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వళ్ళలార్ జీవితమంతా తన సూక్తుల ద్వారా జీవహింస నిరోధక ఉద్యమం నిర్వహించి జ్యోతిస్వరూపుడై ముక్తినొందారు. దేవుడు జ్యోతిస్వరూపుడని చాటిచెప్పేలా వళ్లలార్ సత్యజ్ఞానసభలో ప్రతినెల పుష్యమి నక్షత్రం రోజున ఆరు తెరలను తొలగించి భక్తులకు జ్యోతి దర్శనం కల్పిస్తారు. అయితే తమిళమాసం తై పుష్యమి నక్షత్రదినాన ఆ సభలో ఏడు తెరలను తొలగించి భక్తులకు జ్యోతి దర్శనం కల్పిస్తారు. ఏడోతెర తొలగించగానే వళ్ళలార్‌స్వామి జ్యోతి స్వరూపుడిగా దర్శనమిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే తైపూస జ్యోతి దర్శనం కోసం దేశవిదేశాల నుండి భక్తులు వస్తుంటారు. ఆ మేరకు 154వ తైపూస వేడుకలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వళ్లలార్ జన్మించిన మరుదూరు, నీటితో దీపాన్ని వెలిగించిన కరుంగుళి నివాసంలో, వళ్లలార్ సిద్ధి పొందిన మేట్టుకుప్పంలో, వడలూరు సత్యధర్మసాలైలో ఉదయం 7.30 గంటలకు సన్మార్గపతాకాలను ఎగురవేశారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు వడలూరు సత్యజ్ఞాన సభ ప్రాంగణం వద్ద కూడా భక్తుల నడుమ సన్మార పతకాన్ని ఎగురవేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రథమకాల జ్యోతి దర్శనం, 10 గంటలకు ద్వితీయకాల జ్యోతిదర్శనం, మధ్యాహ్నం ఒంటి గంటలకు తృతీయ కాల జ్యోతి దర్శనం, రాత్రి 7 గంటలకు చతుర్ధ కాల జ్యోతి దర్శనం, 10గంటలకు పంచమ కాల జ్యోతి దర్శనం, బుధవారం వేకువజాము 5.30 గంటలకు షట్కాల జ్యోతి దర్శనం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు సత్య సన్మార్గ సభ నిర్వాహకులు, పోలీసు ఉన్నతాధికారులు, సేవా సంఘాలు తగు ఏర్పాట్లు కల్పిస్తున్నారు. డీఎస్పీ జయకుమార్ పర్యవేక్షణలో సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. తైపూస జ్యోతి దర్శన వేడుకలు ముగిసిన తర్వాత ఈ నెల 13న మేట్టుకుప్పంలోని 'సిద్ధి వళాగ మాళిగై'లో తిరు అరై (పవిత్రమైన గది) దర్శన మహోత్సవం కూడా జరుగుతుంది.



సోమవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్న డీపీఐ నేత తొల్ తిరుమావళవన్

ఆలయ కుంభాభిషేక వేడుకలో క్రికెటర్ అశ్విన్



కుటుంబ సభ్యులతో పాల్గొన్న క్రికెటర్ అశ్విన్

పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలయ మహాకుంభాభిషేకం వేడుకల్లో సీనియర్ క్రికెటర్ అశ్విన్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మైలాడుదురై జిల్లా శీర్గాళి తాలూకా పెరుంతోట్టంలోని విశాలాక్షి సమేత విశ్వనాథర్, లక్ష్మి నారాయణ పెరుమాళ్ ఆలయ జీర్ణోద్ధరణ పనులు ముగిసి ఆదివారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో క్రికెటర్ అశ్విన్ తన కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు అశ్విన్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు.





ఆలయ ప్రధాన గోపుర కలశాలకు మహాకుంభాభిషేకం - వేడుకల్లో పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు, అధికారులు, భక్తులు

నేత్రపర్వంగా బాలియమ్మన్ ఆలయ కుంభాభిషేకం

ప్యారీస్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని దేవి బాలియమ్మన్ ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం కోలాహలంగా జరిగింది. ఈ ఆలయానికి రూ.2.60కోట్లతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శనివారం నుంచి ఆదివారం వరకు యాగాలు జరగాయి. సోమవారం ఉదయం 6గంటలకు బింబశుద్ధి, మహాదీపారాధన, మహాపూర్ణాహుతి వేదపండితులు జరిపారు. ఉదయం 9.10గంటలకు శుభముహూర్తంలో దేవీ బాలియమ్మన్ మూలస్థానం, అయ్యప్పస్వామి ఇతర పరివార దేవతలకు దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు సమక్షంలో, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ గజలక్ష్మి బాలైయార్ అలియాస్ బాలసుబ్రమణ్యం పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం జరిగింది. కార్యక్రమంలో విల్లివాక్కం ఎమ్మెల్యే వెట్రి అళగన్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు శివకుమార్, రాజ్‌కుమార్, రాఘవన్, వలర్మతి, ఠాగూర్ ఆదిత్య, ఆలయ అధికారి గణేష్‌కుమార్ తదితరుల పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించారు.

తిరుప్పోరూరు ఆలయంలో చెంగల్పట్టు కలెక్టర్ వివాహం



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి దామో అన్బరసన్

చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ వివాహం తిరుప్పోరూరు ఆలయంలో అత్యంత వైభవంగా జరిగింది. అరుణ్‌రాజ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సముద్రపాండ్యన్ కుమారుడు. అరుణ్‌రాజ్‌కు అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి పొల్లాచ్చి జయరామన్ బంధువు మేఘనాథన్, జయంతి దంపతుల కుమార్తె డాక్టర్ కౌశికకు ఇటీవలే నిశ్చితార్థం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తిరుప్పోరూరు కందసామి ఆలయ ఉత్సవ మండపంలో అరుణ్‌రాజ్, కౌశిక వివాహం జరిగింది. ఈ వేడుకల్లో మంత్రి దామో అన్బరసన్ పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



పెరంబూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ సిద్ధి వినాయకుడు ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం జరిగింది. నామక్కల్ ప్రభు త్వ ఉద్యోగుల క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న ఈ ఆలయం కుంభాభిషేకం వేడుకలు ఇటీవల ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. మతసామరస్యం చాటేలా, తొలిసారిగా ఆ ప్రాంతంలోని మసీదు నుంచి మహా కుంభాభిషేకానికి అవసరమైన పూజా సామగ్రి, పూలు, పండ్లు తదితరాలను ఆ ప్రాంతంలో నివసిస్తున్న ముస్లిం సోదరులంతా ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. వాటిని ఆలయ నిర్వాహకులు స్వీకరించారు. అనంతరం కుంభాభిషేకం వేడుకగా జరిగింది.



చెన్నై సచివాలయం వద్ద మహిళా స్వయం సహాయక బృందం తయారుచేసే వస్తువుల విక్రయం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన 'మది అనుభవ్' (అంగడి)ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి




వివిధ తరగతులకు సంబంధించిన పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో సోమవారం రాజ్‌భవన్‌లో సమావేశమైన గవర్నర్ ఆర్ఎన్ రవి. ఈసందర్భంగా వారికి 'ఎగ్జామ్ వారియర్స్' అనే పుస్తకాన్ని బహూకరించారు.

● వృషభాల రాజసం..

అట్టహాసంగా గాంగేయం ఎద్దుల పోటీలు









చెన్నై, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గాంగేయం ఎద్దుల అందాల పోటీలు సోమవారం ఉదయం ఈరోడ్ సమీపం బర్గూరు కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి.. ఈ పోటీల్లో జల్లికట్టు పోటీల్లో యువకులను ముప్పుతిప్పలు పెట్టిన మదురై, అలంగానల్లూరు, మేలూరు, తిరుచ్చి, పుదుకోట, తిరునల్వేలి తదితర ప్రాంతాల నుండి సుమారు 200లకు పైగా జల్లికట్టు ఎద్దులు పాల్గొన్నాయి. చూపరులకు భయాన్ని కలిగించేలా వివిధ రంగులతో పదునైన కొమ్ములతో ఉన్న ఈ గాంగేయం ఎద్దులకు అందాల పోటీలు నిర్వహించారు. దేహదారుఢ్యం, చురుకుదనం, ఆరోగ్యం, కొమ్ములతో మట్టిని పెకలించే సామర్థ్యం, వేగంగా పరుగెత్తడం, పెంచే వ్యక్తి మాటలను శిరసావహించడం వంటి అంశాలపై ఈ పోటీలు జరిగాయి. ఊరి పెద్దలు ముగ్గురు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ పోటీల సందర్భంగానే గాంగేయం ఎద్దులతోపాటు, మేలు రకం గుర్రాలను కూడా విక్రయించనున్నారు. గాంగేయం రకం ఎద్దులను పెంచేదిశగా ఈ అందాల పోటీలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కెరీర్‌లో ది బెస్ట్ పాత్ర ఇదే

● నటి రోహిణి



'కాదల్ ఎన్బదు పొదువుడమై' ఆడియో విడుదల కార్యక్రమంలో పాల్గొన్న చిత్రబృందం

తాను హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా గత రెండు మూడు దశాబ్దాల నుంచి చిత్రపరిశ్రమలో కొనసాగుతున్నానని, కానీ, తన సినీ కెరీర్‌లో తాను ఇప్పటివరకు పోషించిన పాత్రల్లో 'లక్ష్మి' అనే పాత్ర 'ది బెస్ట్' క్యారెక్టర్ అని సీనియర్ సినీ నటి రోహిణి అన్నారు. 'లెన్స్', 'తలైక్కూత్తల్' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు జయప్రకాష్ రాధాకృష్ణన్ 'కాదల్ ఎన్బదు పొదువుడమై' అనే పేరుతో ఇద్దరు యువతుల మధ్య ప్రేమను వివరిస్తూ రూపొందించారు. 'ప్రేమ అనేది స్త్రీ పురుషుల మధ్య ఉండేది మాత్రమే కాదని, రెండు స్వచ్ఛమైన హృదయాల మధ్య ఉండేదని, అలాంటి ప్రేమను గౌరవిస్తూ ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకుందాం' అనే కాన్సెప్టుతో తెరకెక్కించారు. ఈ నెల 14వ తేదీ రిలీజ్ కానుంది. దీన్ని పురస్కరించుకుని సోమవారం ఈ చిత్రం ఆడియో ట్రైలర్ రిలీజ్ చేశారు. లిజోమోల్ జోస్, రోహిణి, వినీత్, కలేస్ రామానంద్, అనూష, దీపా తదితరులు నటించారు. జమన్ జాకబ్, నిత్య అద్భుతరాజ్, డిజో అగస్త్యన్, విష్ణు రాజ్ నిర్మాతలు. క్రియేటివ్ ఎంటర్‌టైనర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ధనుంజయన్ రిలీజ్ చేస్తున్నారు. ఆడియో రిలీజ్ వేడుకలో నటి రోహిణి మాట్లాడుతూ, 'నాకు తమిళంలో కంటే తెలుగులో అనేక సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో మంచి పాత్రలు వస్తున్నాయి. తమిళంలో అలాంటి పాత్రలు రావాలని కోరుకుంటున్నారు. నా సినీ కెరీర్‌లో 'ది బెస్ట్' పాత్రను ఈ మూవీలో పోషించాను. ఇలాంటి చిత్రాలు మలయాళంలోనే కాదు.. తమిళంలో కూడా రావాలి' అని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన పాత్ర పోషించిన లిజోమోల్ జోస్ మాట్లాడుతూ, 'నాకు క్యారెక్టర్ నచ్చితే బోల్డ్ పాత్రలోనైనా నటిస్తాను. ఈ సినిమాలో నా పాత్ర అలాంటిదే. ముద్దు సీన్లతో పాటు పలు సన్నివేశాల్లో బోల్డ్‌గా నటించడానికి ప్రధాన కారణం ఆ పాత్ర నాకు బాగా నచ్చింది' అన్నారు. దర్శకుడు జయప్రకాష్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ, 'సమాజంలో స్త్రీ, పురుషుడు అనే లింగభేదం మినహా ప్రతి ఒక్కరూ సమానమే. లెస్బియన్స్‌లోనే కాదు ప్రతి ఒక్కరిలోనూ ప్రేమ ఒక్కటే. వీరిపట్ల సమాజం చిన్నచూపు చూస్తుంది. ఈ సినిమాతర్వాత ఖచ్చితంగా కొంతమార్పు వస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి

'రెట్రో'లో భాగమైనందుకు గర్విస్తున్నా

● పూజా హెగ్డే



'రెట్రో'లో సూర్య - పూజా హెగ్డే

హీరో సూర్య నటించే 69వ చిత్రంలో తాను కూడా భాగస్వామికావడం గర్వంగా ఉందని ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే అన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న 'రెట్రో' మూవీ చిత్రీకరణ పూర్తి చేసి మే ఒకటో తేదీ శ్రామికుల దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయనున్నారు. ఇందులో తనకు దక్కిన అవకాశంపై పూజా హెగ్డే మాట్లాడుతూ, 'ఇప్పటివరకు నేను నటించిన చిత్రాలన్నీ నన్ను గర్వపడేలా చేశాయి. కానీ, 'రెట్రో' మాత్రం నేను గర్వించే చిత్రంగా ఉంటుంది. ఇందులోని ప్రతి సన్నివేశం నాకు చాలా ఇష్టం. షూటింగు సమయంలో పొందిన అనుభూతి ఎన్నటికీ మరిచిపోలేనిది. సినిమా ఇంకా చూడకుండానే గట్టి నమ్మకంతో చెబుతున్నాను. ప్రస్తుతం 'రెట్రో' మూవీ ఎడిటింగ్ జరుగతోఓంది.. త్వరలోనే మేకర్స్ ఆడియో, ట్రైలర్ రిలీజ్ తేదీలు వెల్లడిస్తారు' అని వివరించారు.

'ఇళయరాజా' బయోపిక్‌లో భాగమైన ఏజీఎస్



ధనుష్ - ఇళయరాజా

'ఇసైజ్ఞాని' ఇళయరాజా జీవితచరిత్ర ఆధారంగా ఒక చిత్రం రూపొందనుంది. ధనుష్ హీరో. గతంలో అధికారికంగా ప్రకటించడంతో పాటు టైటిల్, పోస్టర్ కూడా విడుదల చేశారు. అయితే, ఈ ప్రాజెక్టును విరమించుకున్నారనే ప్రచారం సాగుతుంది. వీటిని నిర్మాణ సంస్థ కనెక్ట్ మీడియా తోసిపుచ్చింది. ఈ బయోపిక్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ భాగస్వామ్యమైంది. ఈ విషయాన్ని ఏజీఎస్ ప్రతినిధులు కూడా స్పష్టం చేశారు. దీంతో ఈ బయోపిక్ నిర్మాణ పనులు మళ్ళీ ప్రారంభంకానున్నాయి. అరుణ్ మాధేశ్వరన్ దర్శకుడు. అయితే, ఈయన ప్రస్తుతం ఒక బాలీవుడ్ మూవీలో నటిస్తున్నారు. ఈ మూవీ పూర్తయిన తర్వాత 'ఇళయరాజా' బయోపిక్ ప్రారంభించనున్నారు. ఈ లోగా కనెక్ట్ మీడియా, ఏజీఎస్ నిర్మాణ సంస్థల మధ్య ఈ మూవీ నిర్మాణ ఒప్పందం పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత శరవేగంగా చిత్రీకరణ పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో నిర్మాణ సంస్థలు ఉన్నాయి.

విజయ్ చిత్రంలో శృతిహాసన్



అగ్రహీరో విజయ్ నటిస్తున్న 69వ చిత్రంలో హీరోయిన్ శృతిహాసన్ ఓ ముఖ్య పాత్ర పోషించనున్నట్టు ప్రచారం జరుగుతుంది. గతంలో విజయ్ సరసన 'పులి' సినిమాలో శృతి హీరోయిన్‌గా నటించారు. సుదీర్ఘకాలం తర్వాత వీరిద్దరూ మళ్ళీ కలిసి నటించబోతున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమాలో శృతి నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ థాయ్‌లాండ్‌లో జరుగుతుంది. రజనీకాంత్, శృతిహాసన్ ఇటీవలే థాయ్ నుంచి చెన్నై తిరిగి వచ్చారు. అదేసమయంలో విజయ్ 69వ చిత్రం 'జన నాయగన్' షూటింగ్ నగర శివారు ప్రాంతమైన పనైయూరులో జరుగుతుంది. ఈ షూటింగ్‌లో శృతిహాసన్ పాల్గొన్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. హెచ్. వినోద్ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో బాబీ డియోల్, మమితా బైజు, గౌతం వాసుదేవ మేనన్, ప్రకాష్ రాజ్, వరలక్ష్మి, డీజే అరుణాచలం తదితరులు నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్ పతాకంపై రూపొందే ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన హీరో విజయ్ నటించే చివరి చిత్రం ఇదేనంటూ ప్రచారం సాగుతున్న విషయం తెల్సిందే.

చంద్రబాబు అనుభవంతోనే రాష్ట్రం ముందుకు

- మంత్రి నారాయణ



తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని, సీఎం చంద్రబాబు తనకున్న అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి నారాయణ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. త్వరలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులన్నీ మెరుగుపడి ప్రజలు అన్ని విధాల బాగుండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.


తిరుమలలో గదుల చెకౌట్ కేంద్రం

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు గదుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. తిరుమలలో సిఫార్సు లేఖలపై ఎంబీసీ34, టీబీ కౌంటర్లలో, వీఐపీలకు పద్మావతి కౌంటర్లలో గదులు కేటాయిస్తారు. అయితే గత కొంతకాలంగా పద్మావతి, ఎంబీసీ కౌంటర్ల వద్ద సిఫార్సు లేఖలు ఉన్నప్పటికీ గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనానికంటే గదులు పొందేందుకే అధిక సమయం పడుతోంది. దీనిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో ఆర్‌1 భాస్కర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఉద్యోగుల సిఫార్సుల కోసం ఎంబీసీ34కు సమీపంలో మరొక గదులు కేటాయింపు కౌంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. పద్మావతి వద్ద గదులు ఖాళీ చేసేవారు కూడా క్యూలైన్ ద్వారానే వెళ్లాల్సివస్తోందని గుర్తించి పక్కనే ప్రత్యేకంగా చెకౌట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.. త్వరలోనే ఈకౌంటర్ అందుబాటులోకి రానుంది.



పద్మావతి కార్యాలయం పక్కనే ఏర్పాటు చేస్తున్న చెకౌట్ కేంద్రం

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,536

తలనీలాలు సమర్పించినవారు: 25,890



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 249 వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 249 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 155 ఉండడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, శివశంకర్‌నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వెటర్నరీ వర్సిటీ విద్యార్థుల ఆందోళన

స్టైపండ్ పెంచాలని, తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 8 రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులు.. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వైద్య విద్యకు సమానమైన వెటర్నరీ విద్యను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టరేట్ నుంచి భారీ ర్యాలీగా వెటర్నరీ యూనివర్శిటీకి వెళ్లారు. యశ్వంత్, లీలాప్రసాద్, నాగరాజు, ఉషా మనోహర్, పవన్, నిరంజన్, మనోజ్, గుణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



వెటర్నరీ విద్యార్థుల ధర్నా

మా పొలాలకు 'గంగ'ను ఇవ్వండి

'బాలయ్యపల్లి మండలం గిరిజన కాలనీకి చెందిన.. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో నిమ్మచెట్లు సాగు చేశాం. దీనికి 2009లో ఐటీడీఏ మూడు బోర్లు వేయగా.. నీళ్లు పడలేదు. మేమూ సొంతంగా బోర్లు వేసినా.. నీళ్లు సరిపోవడం లేదు. సుమారు 30 ఎకరాల్లో నిమ్మచెట్లు, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. మా పొలాలకు కొంత దూరంలో తెలుగుగంగ కాలువ ఉంది. దీని నుంచి నీటిని మాకు ఇవ్వాలి' అని రైతులు కోరారు.



బాలాయపల్లి రైతులు



ఎస్టీ కార్పొరేషన్ రుణం మంజూరు చేయించండి

రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. పింఛను అయితే వస్తోంది. ముగ్గురు పిల్లలు, కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఎస్టీ కార్పొరేషన్‌లో రుణం ఇప్పిస్తే చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తాను. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు దయ చూపడం లేదు. మీరైనా కరుణించండి.

- వెంకటేశ్వరరావు, ఎంపేడు, శ్రీకాళహస్తి మండలం

పింఛను కోసం ఏడాదిగా తిరుగుతున్నా..

పింఛను కోసం కలెక్టరేట్ చుట్టూ సంవత్సరం నుంచి తిరుగుతూనే ఉన్నాను. ఎవరూ పట్టించుకోవడంలేదు. సచివాలయ సిబ్బందిని అడిగితే సరిగా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించండి.

- చిరంజీవి, కొండకిందపల్లి, పదిపుట్లబైలు



తిరుపతిలో శాయ్ డీడీ పర్యటన

● మైదానాలు, భవనాల పరిశీలన



ఎస్వీయూ డార్మెటరీలో వంటశాలను పరిశీలిస్తున్న శాయ్ అధికారులు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) డిప్యూటీ డైరెక్టర్ నవీన్‌కుమార్ సోమవారం తిరుపతిలో పర్యటించారు. కర్నూలు, ఏలూరు, వైజాగ్, యానాంలో ఉన్నట్లుగా తిరుపతిలోనూ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు గతేడాది డిసెంబరులో శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రతిపాదనలు తయారు చేసుకొని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ ఎస్.మాండవ్యను కలిశారు. ఆయన సూచన మేరకు శాయ్ డిప్యూటీ డైరెక్టర్(బెంగళూరుశాఖ)నవీన్‌కుమార్ సోమవారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయానికి చేరుకొన్నారు. డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తదితరులతో సమావేశమయ్యారు. జిల్లాలోని మైదానాలు, క్రీడా సదుపాయాలు, క్రీడల గురించి తెలుసుకున్నారు. ఎస్వీయూలోని డార్మెటరీ, ఫ్యాకల్టీక్వార్టర్స్, ఎమ్మెల్సీ భవనం, తారకరామ మైదానం, శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఇండోర్ స్టేడియం, మల్టీపర్పస్‌హాల్‌ను పరిశీలించారు. ప్రతి భవనాన్ని తన సెల్‌ఫోన్‌లో వీడియో, ఫొటోలు తీసుకుంటూ సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తాను తనిఖీ చేసిన భవనాల స్థితిగతులపై నివేదిక తయారుచేసి శాయ్ ప్రధాన కార్యాలయానికి అందిస్తానని నవీన్‌కుమార్ చెప్పారు. ఇప్పటికే శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఖేలోఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఏర్పేడు వద్ద ఐసర్‌లో అథ్లెటిక్‌ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరుచేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తామన్నారు.



తిరుపతిలో లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్న జైపూర్ పోలీసులు

ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో లక్ష్మీరెడ్డి అరెస్టు

● అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మోసం చేశాడంటూ ఆరోపణలు చేసిన తిరుపతి ఎంఆర్‌పల్లెకి చెందిన లక్ష్మీరెడ్డిని సోమవారం రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో వివిధ రాష్ట్రాల్లో ఈమెపై కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఆమె కోసం కొన్ని నెలలుగా గాలిస్తున్న జైపూర్ పోలీసులు.. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ తర్వాత లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. 2021లో జైపూర్, చాంద్వాజీ పోలీసు స్టేషన్లలో లక్ష్మీరెడ్డితో పాటు అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ఖాన్‌పై చీటింగ్ కేసు నమోదైందని తిరుపతి పోలీసులు చెప్పారు. అదుపులోకి తీసుకున్న లక్ష్మీరెడ్డిని ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ్నుంచి వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు ముగిసిన వెంటనే తిరుపతిలోని అదనపు జ్యుడిషియల్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు. ఆ తర్వాత ఆమెను జైపూర్‌కు తీసుకెళ్లనున్నారని ఎస్వీయూ స్టేషన్ సీఐ రామయ్య చెప్పారు.

వివిధ సెక్షన్ల కింద కేసు

లక్ష్మీరెడ్డిపై సెక్షన్ 419, 420, 66సీ, 66డీ, 120-బి, 406 సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో వున్న లక్ష్మీరెడ్డి కోసం పోలీసులు కొన్ని సంవత్సరాలుగా వెతుకుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో మూడు రోజులుగా కిరణ్‌రాయల్ వ్యవహారంలో మీడియాలో కనిపించడంతో జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చారు. అరెస్టుకు ముందు లక్ష్మీరెడ్డి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజును కలిసి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు చేరుకుని మీడియా సమావేశంలో కిరణ్ రాయల్‌పై ఆరోపణలు చేశారు.

కిరణ్ మాటలకు మోసపోయా

- లక్ష్మీరెడ్డి ఆరోపణ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ మాయమాటలు నమ్మి మోసపోయానని బాధితురాలు లక్ష్మీరెడ్డి ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ కిరణ్ పరిచయం అయినప్పటి నుంచి అతడికి అన్నీతానై ఆర్థికంగా సహాయ సహకారాలు అందించానని చెప్పారు. తనవద్ద నుంచి రూ.1.2 కోట్లను తీసుకున్నాడని, ఆ మొత్తం రాబట్టుకోవడానికే పోరాడుతున్నానన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తన బతుకును హేళన చేసే విధంగా కిరణ్‌రాయల్ ట్రోల్ చేయిస్తున్నాడని ఆరోపించారు.



ఆమె పెద్ద చీటర్ అని అప్పుడే చెప్పా

● జైపూర్ పోలీసుల అరెస్టుతో రుజువైందన్న కిరణ్

తిరుపతి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'నాపై అసత్యపు ఆరోపణలు చేస్తున్న లక్ష్మి పెద్ద చీటర్ అని తొలిరోజే చెప్పా. ఎవరూ నమ్మలేదు. జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చి అరెస్టు చేయడంతో నేను చెప్పింది నిజమైంది' అని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ 2.0' పోస్టర్ విడుదల చేశాక వైసీపీ నాయకులు కుట్రపన్ని తన రాజకీయ జీవితాన్ని అణిచివేయాలని చూశారన్నారు. వైసీపీ స్వార్థ రాజకీయాలకోసం మహిళను వాడుకున్నారని, పర్యవసానంగా ఆమె ఎక్కడవుందా? అని వెతుకుతున్న జైపూర్ పోలీసులకు దొరికిపోయిందన్నారు. ఆడవాళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందంటే తాను చావడానికైనా సిద్ధమన్నారు. కోర్టులో న్యాయం గెలుస్తుందని, తనకు అండగా ఉన్న జనసేన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్వీయూ ఘటనలో ఇద్దరి అరెస్టు

● గంజాయి, హత్యాయత్నం కింద కేసులు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ హాస్టల్‌లోని ఇద్దరు విద్యార్థులపై ఆదివారం రాత్రి కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితులపై గంజాయి, హత్యాయత్నాల కింద కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేశారు. ఎస్వీయూ సీఐ రామయ్య కథనం మేరకు.. వెంకటగిరి మండలానికి చెందిన మణికంఠ తిరుపతిలో జులాయిగా తిరుగుతున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డాడు. ఎక్కడపడితే అక్కడ రౌడీయిజం చేయడం, అవసరమైతే హత్యాయత్నాలకు పాల్పడడం అలవాటుగా మారింది. దీంతో మణికంఠపై వర్శిటీ పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఈ క్రమంలో ఎస్వీయూలో ఉన్న ఓ వైసీపీ విభాగం నాయకుడితో కలిసి వర్శిటీకి వస్తుంటాడు. ఈ క్రమంలో కడప జిల్లాకు చెందిన మరో విద్యార్థి పరిచయమయ్యాడు. రోజూ అతడి గదికి రాత్రి సమయాల్లో వచ్చి మద్యం తాగేవారు. ఇది రూమ్‌మేట్ హరికి నచ్చక మరో రూముకు వెళ్లి చదువుకునే వాడు. శనివారం రాత్రి రూము నెంబరు 18 వద్ద చదువుకుంటున్న హరి వద్దకు మణికంఠ, అతడి స్నేహితుడు, వర్సిటీ విద్యార్థి అయిన యోగేశ్వర్ వచ్చారు. తాను గదికి వస్తే.. నువ్వు ఇక్కడికి ఎందుకు వస్తున్నావంటూ హరితో మణికంఠ గొడవపడ్డాడు. తమ గది వద్దకు వచ్చి ఎందుకు గొడవ చేస్తున్నావంటూ వెంకటేష్‌బాబు నిలదీశారు. అప్పటికే మద్యం, గంజాయి మత్తులో ఉన్న మణికంఠ అతడిపై కత్తితో దాడి చేశాడు. వర్శిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునిమణికంఠ, యోగేశ్వర్‌పై గంజాయి, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే చర్యలు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు స్పష్టంచేశారు. ఆదివారం రాత్రి హెచ్-బ్లాక్ హాస్టల్లో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో సోమవారం వీరు పరిశీలించారు. గాయపడిన విద్యార్థిని పరామర్శించారు. హాస్టళ్లలో సమస్యలకు కొందరు సిబ్బంది తీరు కూడా కారణమని పలువురు విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో, బయటి వ్యక్తుల గురించి అధ్యయనం, చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ కమిటీ నివేదిక అందిన వెంటనే యూనివర్సిటీ హాస్టళ్లలోని బయటి వ్యక్తులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులపైనా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. బయటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు రండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే, అధికారుల ఆహ్వానం



సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో సీఎంను సోమవారం వీరు కలిసి ఆహ్వాన పత్రికను లాంఛనంగా అందజేశారు. ఆలయ వేదపండితులు సీఎంకు తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వేదాశీర్వాదమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులతో చంద్రబాబు మాట్లాడారు. ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలపై దాడి అనాగరికం : సాహిత్యవేత్తలు

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు, ఆటోనగర్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం కుట్ర కాదు, రచయితలు కుట్రదారులు కాదని పలువురు సాహిత్యవేత్తలు స్పష్టం చేశారు. తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం తిరుపతిలో పుస్తక, సాహిత్యాభిమానులు సమావేశమయ్యారు. 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనలో శనివారం కొందరు దాడి చేసి బీభత్సం చేసిన సంఘటను ఖండించారు. సమాజంలో భిన్నాభిప్రాయాలకు చోటుండాలన్నారు. లేకపోతే మానవ మనుగడే ప్రమాదంలో పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతి ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీని కలిశారు. 17 ఏళ్లుగా ఎంతో గౌరవంగా జరుగుతున్న పుస్తకోత్సవాల గురించి వివరించారు. దాడి సంఘటన వీడియోలను ఎస్పీకి చూపించారు. దాడికి గురైన విశాలాంధ్ర పుస్తకాల షాప్ ప్రతినిధి శంకర్‌ను విచారించి, వెంటనే చర్యలకు ఆదేశించిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి.అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఒ. వెంకటరమణ, అజీమ్ బాష, రామానాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, సాయిలక్ష్మి, హేమలత, జయంతి, వెంకటాద్రి, హరీష్ పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న పుస్తక, సాహిత్యాభిమానులు

నేడు పుస్తక ప్రియుల ర్యాలీ

తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడిని నిరసిస్తూ మంగళవారం తిరుపతిలో పుస్తక ప్రియులు పుస్తకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచీ నాలుగుకాళ్ళ మండపం దాకా ఈ ర్యాలీ సాగనుంది. రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు తమకు నచ్చిన పుస్తకాలను పట్టుకొని ఈ ప్రదర్శనలో పాల్గొనాలని తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక కన్వీనర్ వాకా ప్రసాద్ కోరారు.

లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 23 మద్యం దుకాణాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం లాటరీ ద్వారా డిప్ తీసి అర్హులైన వారికి కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు కింద రూ.4.60 లక్షల ఆదాయం లభించింది.

పీజీ, పీహెచ్‌డీ సెట్స్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు



నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం చేపట్టనున్న ఏపీపీజీసెట్, ఏపీపీహెచ్‌డీ సెట్ కన్వీనర్‌గా ఎస్వీయూ ఓఆర్‌ఐ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచీ ఆయన సోమవారం అందుకున్నారు.

దొంగలపై స్పెషల్ ఫోకస్

● ముమ్మరంగా కార్డెన్ సెర్చ్‌లు ● పాత నేరస్థుల కదలికలపై నిఘా

● థార్, పార్థు గ్యాంగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశాలు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దొంగలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దొంగతనాలు, హౌస్ బ్రేకింగ్‌లు, చైన్ స్నాచింగ్‌ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు సర్కిళ్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసి ఎస్పీ హర్షవర్ధనరాజు విధులు కేటాయించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు హోంగార్డుల నుంచి అదనపు ఎస్పీల వరకు రోడ్లపై ఉండి.. విజువల్ పోలీసింగ్ గట్టిగా చేయాలని ఆదేశించారు. మరోవైపు జైళ్ల నుంచి విడుదలైన వారు, పాత నేరస్థుల కదలికలపై దృష్టి సారించారు. ఇప్పటికే సబ్ డివిజన్ల వారీగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చే పని మొదలు పెట్టిన పోలీసులు.. ఆయా పోలీసు స్టేషన్లలోని నేరస్థుల జాబితాలు పరిశీలిస్తున్నారు. నేరస్థుల చిట్టాను సిద్ధం చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఎవరు ఎలాంటి నేరాలకు పాల్పడ్డారు? థార్, పార్థు గ్యాంగ్‌లు గతంలో ఎక్కడైనా చోరీలు, హౌస్ బ్రేకింగ్‌లకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వారి వేలిముద్రలు బయటకు తీసి మళ్లీ పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 340 మంది పాత నేరస్థులు వున్నట్లు సమాచారం.

డీజీపీ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఏకాంత కాలనీలు, శివారు ప్రాంతాలు, ఖరీదైన విల్లాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. వెంకటగిరి, బాలయ్యపల్లి, డక్కిలి, శ్రీకాళహస్తి, తిరుపతి, నాయుడుపేట, డీవీ సత్రం, వెంకటగిరి ప్రాంతాల్లో సోమవారం ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 153 వాహనాలకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ఇలాంటి కార్డెన్ సెర్చ్‌లు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. వీటితో పాటు నైట్ పెట్రోలింగ్, విజువల్ పోలీసింగ్, మొబైల్ వాహనాల్లో గస్తీ తిరగడం వంటి వాటిని మరింత పటిష్ఠ పరచడానికి చర్యలు తీసుకున్నారు.